

టేకులపల్లి: అధికారులను ప్రశ్నిస్తున్న గ్రామస్తులను అడ్డుకుంటున్న పోలీసులు



రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర తన పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఆశీస్సులు అందుకుంటున్న దృశ్యం –ఖమ్మం, జనవరి 24



సారపాక పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న గ్రామస్తులు



ఖమ్మం రూరల్: పెద్దతండా గ్రామసభకు పెద్ద సంఖ్యలో హాజరైన ప్రజలు



సభా వేదిక వద్దకు వెళ్లకుండా గ్రామస్తులను అడ్డుకుంటున్న పోలీసులు



అశ్వారావుపేట: అనర్హులకు పథకాలు ఎలా ఇస్తారంటూ ప్రశ్నిస్తున్న గ్రామస్తులు



ఖమ్మం రూరల్: వేదిక పైకి వచ్చిన మహిళలను వెనక్కు పంపుతున్న పోలీసు



టేకులపల్లి: పోలీసులను ప్రశ్నిస్తున్న మహిళలు



టేకులపల్లిలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

# చివరి రోజూ నిలదీతలు

- నిరుపేదల ఆశలపై నిలువునా నీళ్లు చల్లిన కాంగ్రెస్ ప్రభుత్వం
- అనేక మండలాల్లో రసాభాసగా, ఉద్రిక్తంగా మారిన గ్రామసభలు
- 'డాబాలో అద్దెకుంటే ఇందిరమ్మ ఇల్లు రాదా?' అంటూ పేదల ప్రశ్నలు
- అశ్వారావుపేటలో వేదికపైకి ఎక్కి ప్రభుత్వాన్ని ప్రశ్నించిన అంధుడు
- సారపాకలో సభ ప్రారంభంలోనే వెనుదిరిగిన భద్రాచలం ఐటీడీఏ పీవో
- కొత్తగూడెం పట్టణంలో ప్రభుత్వోద్యోగి భర్తకు ఇల్లిచ్చారంటూ నిరసన
- 'పేట'లో ఎమ్మెల్యే జారే హాజరైన గ్రామసభలో ఖాళీ కుర్చీల దర్శనం
- టేకులపల్లిలో జనాగ్రహంతో అధికారులను ఆఫీసులోకి తీసుకెళ్లిన పోలీసులు

–ఖమ్మం, నమస్తే తెలంగాణ ప్రతినిధి / భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ, జనవరి 24

ఉమ్మడి జిల్లాలోని గ్రామసభల్లో చివరి రోజైన శుక్రవారం కూడా ఉద్రిక్తతలు, నిరసన జ్వాలలు కొనసాగాయి. ఇందిరమ్మ కమిటీల పేరుతో కాంగ్రెస్ నాయకులు తమ కార్యకర్తల పేర్లతో ఏకపక్షంగా జాబితాలు రూపొందించుకున్నారంటూ ప్రజలు ఆగ్రహించారు. ఖమ్మం రూరల్ మండలం పెద్దతండా ప్రజలు అధికారులపై తిరగబడ్డారు. పథకాల పేరిట ప్రభుత్వం తమను మోసం చేసిందంటూ ఆగ్రహించారు. ఏకంగా మైక్ అందుకొని మరీ కాంగ్రెస్ ప్రభుత్వంపై దుమ్మెత్తిపోశారు. ఇదే సభలో మరికొందరు రైతులు రైతుభరోసా పథకంపైనా నిలదీశారు. గడిచిన సీజన్ల పెట్టుబడి సాయం ఎప్పడిస్తారో చెప్పాలంటూ ప్రశ్నించారు. అశ్వారావుపేటలో ఓ అంధుడు అధికారులను నిలదీశాడు. సభావేదికపైకి చేరుకొని 'ఇందిరమ్మ ఇంటికి నేను అర్హుడిని కాదా సారూ..' అంటూ ప్రశ్నించాడు. దీంతో పోలీసులు అతడిని బలవంతంగా కిందకు దించేశారు. అదే సభలో మరికొందరు గ్రామస్తులు కూడా రేవంత్ సర్కారుపై భగ్గుమన్నారు. 'స్థలమూ ఇవ్వదు. ఇల్లూ ఇవ్వదు. మాలాంటి నిరుపేదలకు ఈ ప్రభుత్వం ఇంకేమి ఇస్తుంది?' అంటూ ప్రశ్నించారు. సారపాక గ్రామసభ కూడా రసాభాసగా మారింది. సాక్షాత్తూ ఐటీడీఏ పీవో సభ మొదలైన కొద్దిసేపటికే వెళ్లిపోయారు. జాబితాలో పేర్లు రాని అర్హులుంటే మరోసారి దరఖాస్తు చేసుకోవాలంటూ సూచించి వెనుదిరిగారు.

నాలుగు పథకాలకు అర్హులను ఎంపిక చేశామంటూ గొప్పలు చెప్పిన ప్రభుత్వం.. నాలుగు రోజులపాటు నిర్వహించిన గ్రామసభల్లో ఆ అర్హుల జాబితాలను వెల్లడించింది. తీరా ఆయా జాబితాలను పరిశీలించుకున్న పేదలు.. వాటిల్లో తమ పేర్లే లేవంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కడిగిపారేశారు. జాబితాల్లో ఒక్కరో ఇద్దరో అనర్హులుంటే గ్రామసభలన్నీ ప్రశాంతంగానే జరిగేవి. కానీ ఏకంగా నాలుగు రోజులుగా గ్రామాల్లో సభలు పెట్టి అర్హుల జాబితాలు ప్రకటించినా.. వాటిల్లో ఎక్కడా కూడా పథకాలకు తాము ఎంపికయ్యామంటూ పేదలు సంతోషంగా బయటికొచ్చిన దృశ్యాలు లేవంటే అతిశయోక్తి కాదు. అనర్హులను వడపోయాల్సిన జాబితాలు అర్హులను వడపోసినట్లుగా ఉండడంతో జనాలు ఆగ్రహించారు. పాల్వంచలో సభలు ముగిసినప్పటికీ దరఖాస్తులతో మున్సిపల్ కార్యాలయానికి ప్రజలు పోటెత్తారు. టేకులపల్లిలో అధికారులు చుట్టుముట్టడంతో పోలీసులు స్పందించి అధికారులను పంచాయతీ కార్యాలయంలోకి తీసుకెళ్లి తలుపులు వేసి తాళం వేశారు. ఇదే మండలంలోని గ్రామసభలో తనపై మహిళలు దాడి చేశారని, తన కంటికి గాయమైందని మహిళా కార్యదర్శి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన విధులకు గ్రామస్తులు ఆటంకం కలిగించారంటూ రఘునాథపాలెం మండలం బావోజీతండా కార్యదర్శి కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొత్తగూడెం పట్టణంలో ప్రభుత్వోద్యోగి భర్తకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడంతో పట్టణ ప్రజలు భగ్గుమన్నారు. అశ్వారావుపేటలో ఉదయం 8 గంటలకే గ్రామసభ ఉండడంతో గ్రామస్తులెవరూ హాజరుకాలేదు. సాక్షాత్తూ ఎమ్మెల్యే వచ్చినప్పటికీ ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. మొత్తంగా నాలుగు పథకాలు వస్తాయనుకుంటూ ఎంతో ఆశగా ఎదురుచూసిన పేదల ఆశలపై కాంగ్రెస్ ప్రభుత్వం నిలువునా నీళ్లు చల్లింది.

## వెంటనే వెనుదిరిగిన పీవో..



పంచాయతీ ఈవోను నిలదీస్తున్న సారపాక గ్రామస్తులు

బూర్గంపహాడ్ మండల గ్రామసభలు కూడా ఉద్రిక్తంగా ముగిశాయి. సారపాక సభ ప్రారంభమయ్యాక జాబితాలోని పేర్లను అధికారులు చదువుతుండగా నిరుపేదలు అభ్యంతరం వ్యక్తం చేశారు. లిస్టులో అర్హుల పేర్లు కాకుండా అనర్హుల పేర్లే అధికంగా ఉన్నాయంటూ మండిపడ్డారు. దీంతో స్పందించిన ఐటీడీఏ పీవో.. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందుతాయని అన్నారు. జాబితాలో పేర్లులేని వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని చెప్పి సభ నుంచి వెళ్లిపోయారు. అనంతరం జాబితాలోని అనర్హుల పేర్లపై బీఆర్ఎస్ సహా వివిధ పార్టీల నాయకులు, ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ కమిటీల పేరుతో కాంగ్రెస్ వాళ్లే వారి కార్యకర్తల పేర్లతో జాబితాను నింపారంటూ బీజేపీ నాయకుడు ఏనుగుల వెంకటరెడ్డి నిలదీశారు. అర్హుల పేర్లు జాబితాలో లేవంటూ బీఆర్ఎస్, బీజేపీ, సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు అధికారులను నిలదీశారు. దీంతో ఎస్సై రాజేశ్ వారిని అడ్డుకున్నారు. చివరకు జాబితా చదవడం పూర్తయిందని, గ్రామసభ ముగిసిందని అధికారులు చెప్పడంతో అక్కడున్న ప్రజలు, సుందరయ్య కాలనీ మహిళలు, ఆయా పార్టీల నాయకులు పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు.

## డాబా ఇంట్లో అద్దెకుంటే ఇందిరమ్మ ఇల్లు రాదా?



పేటలో అధికారులను నిలదీస్తున్న అంధుడు

సొంతిల్లులేక ఎన్నో ఏళ్లుగా అద్దె ఇంట్లో ఉంటున్నామని, అయితే డాబాలో అద్దెకున్నంతమాత్రాన ఇందిరమ్మ ఇళ్లకు ఎలా అనర్హులమవుతామని అశ్వారావుపేట మండల ప్రజలు ఆగ్రహించారు. ప్రజాప్రభుత్వమని, ఇందిరమ్మ రాజ్యమని నమ్మబలికిన రేవంత్ సర్కారు.. తమను నట్టేట ముంచిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో తన పేరు లేకపోవడంతో అంధుడైన అశ్వారావుపేట పాస్టర్ గోగాడ విజయకుమార్ ఆవేదనకు లోనయ్యారు. సభావేదిక పైకి చేరుకొని 'నేను అర్హుడిని కాదా సారూ..' అంటూ అధికారులను ప్రశ్నించారు. జాబితాలో పేదల పేర్లు లేకపోవడంతో ఇదే గ్రామసభలో బీఆర్ఎస్, సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు.

## అశ్వారావుపేట ఎమ్మెల్యే హాజరైన సభలో ఖాళీ కుర్చీలు..

అశ్వారావుపేట గ్రామసభకు సాక్షాత్తూ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ హాజరైనప్పటికీ గ్రామస్తులు రాకపోవడంతో అక్కడ ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. ఉదయం 8 గంటలకు గ్రామసభ నిర్వహించాల్సి ఉంది. అటు అధికారులుగానీ, ఇటు గ్రామస్తులుగానీ ఆ సమయానికి రాలేదు. అప్పటికే ఎమ్మెల్యే హాజరుకావడంతో వేదికపైన కొద్దిమంది అధికారులే ఉన్నారు.



## ప్రజాగ్రహంతో పంచాయతీ ఆఫీసులోకి అధికారులు..



అధికారులు ఉన్న గదిని చుట్టుముట్టిన గ్రామస్తులు

టేకులపల్లి మండల గ్రామసభల్లో ప్రజాగ్రహం పెల్లుబికింది. పథకాలన్నింటికీ ఏకపక్షంగా కాంగ్రెస్ వాళ్లనే ఎంపిక చేశారంటూ అధికారులను గ్రామస్తులు నిలదీశారు. టేకులపల్లి పంచాయతీలో ఎంపీడీవో రవీందర్‌రావు అర్హుల జాబితాను చదివి వినిపించారు. అందులో పేదల పేర్లు లేకపోవడంతో మహిళలు ఒక్కసారిగా సభా వేదికపైకి దూసుకొచ్చారు. పేర్లన్నీ కాంగ్రెస్ వాళ్లవే ఉన్నాయంటూ అధికారులను ప్రశ్నించారు. దీంతో అక్కడ ఘర్షణ వాతావరణం నెలకొన్నది. అక్కడే ఉన్న సీఐ సురేశ్, ఎస్సై శ్రీకాంత్‌లు గ్రామస్తులను సముదాయించారు. అయినా వారు శాంతించకపోవడంతో అధికారులను పంచాయతీ కార్యాలయంలోకి తీసుకెళ్లి తలుపులు పెట్టారు.

# కాంగ్రెస్ సర్వేలతో గ్రామాల్లో ఘర్షణలు

- పోలీసుల పహారాలోనే గ్రామసభలు: తాతా మధు
- కాంగ్రెస్ చేతగానితనం బయటపడింది: సండ్ర



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధు, చిత్రంలో సండ్ర, కూరాకుల, ఆర్జేసీ

ఖమ్మం, జనవరి 24 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఇందిరమ్మ రాజ్యమని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ పార్టీ విధివిధానాలతో గ్రామాల్లో ఘర్షణలు జరుగుతున్నాయని, పారదర్శకత, నిజాయితీ లేని సర్వేల కారణంగా అర్హులకు నష్టం జరుగుతున్నదని ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ ధ్వజమెత్తారు. ఖమ్మంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు, రైతుభరోసా పథకాల కోసం ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితా తప్పులతడకగా ఉందని విమర్శించారు. అర్హులను ఎంపిక చేయకుండా అనర్హులను జాబితాలో పొందుపరచడం ద్వారా గ్రామాల్లో ఘర్షణలు జరుగుతున్నాయని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాన్ని చూస్తున్న ప్రజలు కాంగ్రెస్‌కు ఎందుకు ఓట్లు వేశామా అని బాధ పడుతున్నారని పేర్కొన్నారు. ఏ ఒక్క గ్రామసభ కూడా గొడవ లేకుండా లేదన్నారు. గ్రామసభల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు ఎందుకు పాల్గొనలేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకులు ప్రజలను రెచ్చగొట్టడం లేదని, ప్రజలే స్వయంగా ధర్నాలకు దిగుతున్నారని అన్నారు. ఈ విషయాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలుసుకోవాలన్నారు. పొంగులేటి చేతనైతే వెంటనే రాజీనామా చేయాలని, అప్పుడు ఎవరి సత్తా ఏమిటో ప్రజలే తేలుస్తారని అన్నారు. పేదలకు ప్రభుత్వ ఫలాలు దక్కేవరకు బీఆర్ఎస్ పోరాడుతుందని స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ.. ఈ నెల 26న తుది జాబితాను వెల్లడిస్తామన్న నాయకులు ఆ రోజు వరకు దరఖాస్తులు తీసుకుంటామని చెప్పడం వెనుక నిజాయితీ ఎంటో తెలుస్తుందని అన్నారు. గ్రామసభలను బహిష్కరించాలని బీఆర్ఎస్ ఎక్కడా పిలుపు ఇవ్వలేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నాయకులు కూరాకుల నాగభూషణం, ఆర్జేసీ కృష్ణ, కర్నాటి కృష్ణ, దొడ్డా శ్రీనివాసరావు, బెల్లం వేణు, పగడాల నాగరాజు, వీరమోహన్‌రెడ్డి, బాదావత్ బాలాజీ, బలుసు మురళీకృష్ణ, నరేందర్ పాల్గొన్నారు.

# ప్రజాపాలన దరఖాస్తులు ఎక్కడ?

రైతుభరోసా పేరిట మోసం చేసిన ప్రభుత్వం: రేగా



మాట్లాడుతున్న బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

అశ్వాపురం, జనవరి 24: ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించడమే కాంగ్రెస్ ప్రభుత్వం పనిగా పెట్టుకున్నదని, ఏడాది కాలంలో చేసిందేమీ లేదని బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ధ్వజమెత్తారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ నాయకుడు కందుల కృష్ణార్జునరావు నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా పాలన పేరిట స్వీకరించిన దరఖాస్తులు ఏమయ్యాయి? కులగణన సర్వే పేరిట స్వీకరించిన డేటా ఏమైంది? అని ప్రశ్నించారు. రైతుభరోసా పేరిట రైతులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం నేటికీ అనేక మంది రైతులకు రుణమాఫీ చేయకుండా గోస పెడుతుందన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలే బాహాటంగా తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులకే పథకాలు ఇస్తామని ప్రకటనలు చేస్తున్నప్పుడు దరఖాస్తుల స్వీకరణ ఎందుకని ఆయన ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకులు కోడి అమరేందర్, ఈదర సత్యనారాయణ, జాలే రామకృష్ణారెడ్డి, కందుల కృష్ణార్జునరావు, సూదిరెడ్డి గోపిరెడ్డి, వెన్న అశోక్ కుమార్, తోకల లత, కందుల దుర్గాభవాని, తాటి పూజిత, చిలక వెంకటరామయ్య, నక్కనబోయిన పాపారావు, మేడవరపు సుధీర్, తోకల దుర్గాప్రసాద్, బొల్లినేని గణేశ్, గొర్రెముచ్చు వెంకటరమణ, గద్దల రామకృష్ణ, లోహిత్, డాక్టర్ బాబు, నజీర్ సోను పాల్గొన్నారు.

# ఏడాదిపాలనలో ప్రభుత్వం చేసిందేమీలేదు

జడ్పీ, టీఎస్ సీడ్స్ మాజీ చైర్మన్లు లింగాల, కొండబాల



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ మాజీ చైర్మన్ కమల్‌రాజు, చిత్రంలో కొండబాల

ఎర్రుపాలెం, జనవరి 24: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదని జడ్పీ, టీఎస్ సీడ్స్ మాజీ చైర్మన్లు లింగాల కమల్‌రాజు, కొండబాల కోటేశ్వరరావు దుయ్యబట్టారు. ఎర్రుపాలెంలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం పార్టీ మండల కార్యదర్శి యన్నం శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదేళ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందని అన్నారు. ఇప్పటికిప్పుడు రాష్ట్రంలో ఎన్నికలు జరిగితే బీఆర్ఎస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ నుంచి ఎవరు వెళ్లిపోయినా ఉన్న నాయకులు సమష్టిగా పనిచేసి పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామసభల్లో ప్రభుత్వ పథకాల జాబితాలో తమ పేర్లు లేకపోవడంతో ప్రజలు కాంగ్రెస్ నాయకులను నిలదీస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు బంధం శ్రీనివాసరావు, చిత్తారు నాగేశ్వరరావు, పెంట్యాల పుల్లయ్య, చేబ్రోలు మల్లికార్జున్, శ్రీనివాస్‌రెడ్డి, శీలం కవిత, బొగ్గుల భాస్కర్‌రెడ్డి, వేమూరి ప్రసాద్, మంకెన రమేశ్, శ్రీకాంత్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, కృష్ణారెడ్డి, తిరుపతిరావు, మస్తాన్‌వలీ, కృష్ణారావు, కోటా శ్రీనివాసరావు, నర్సింహా, సాంబశివరావు, గోపాల్‌రావు పాల్గొన్నారు.

# 'ఆత్మీయ భరోసా' అందించాలి

చంద్రుగొండ మండల పరిషత్ ఎదుట మహిళా కూలీల ధర్నా



చంద్రుగొండ, జనవరి 24: అర్హులైన కూలీలందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ ఉపాధిహామీ పథకం మహిళా కూలీలు చంద్రుగొండ మండల పరిషత్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కూలీలు మాట్లాడుతూ 2023–24 ఆర్థిక సంవత్సరంలో కనీసం 20 రోజులపాటు పనిచేసి ఉండాలనే నిబంధనలు తొలగించాలన్నారు. అసలైన నిరుపేదల కూలీల కుటుంబాలను గుర్తించి వారికే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. నిరుపేదలకు అందించే ప్రభుత్వ పథకాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకుల జోక్యాన్ని తగ్గించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధిహామీ కూలీలు బొల్లెపోగు వరలక్ష్మి, కాకటి హైమావతి, రెడ్డిపోతు సునీత, కాకటి ధనమ్మ, పోతురాజు పార్వతి, బొల్లెపోగు యశోద, చెంగల రాములమ్మ, రెడ్డిపోతు సునీత తదితరులు పాల్గొన్నారు.